క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయటౌన్: అరకులోయ 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రంలో పెయింటింగ్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఈఈ ఎ.వి.ఎన్.ఎం.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పెదలబుడు, చినలబుడు, మాడగడ, చొంపి, సుంకరమెట్ట, శిరగాం, లోతేరు, గన్నెల, బొండాం, మాదల, బస్కీ, ఇరగాయి, పద్మాపురం, కొత్తభల్లుగుడ పంచాయతీల పరిధిలోని గ్రామాలతో పాటు డుంబ్రిగుడ మండలం అరకు పంచాయతీ అరకు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

దంత సమస్యలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది తదితరులు

అడ్డతీగల: దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీహెచ్‌సీ దంత వైద్యురాలు అనూష చెప్పారు. స్థానిక సీహెచ్‌సీలో దంత సమస్యలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రతిరోజు మూడుసార్లు బ్రెష్ చేసుకోవాలన్నారు. పంటి సమస్య, నోటి దుర్వాసన రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అల్పాహారం, భోజనం చేసిన తరువాత నోటిలో నీళ్లు పోసుకుని పుక్కిలించాలన్నారు. ఏదైనా పంటి సమస్య వస్తే స్థానిక సీహెచ్‌సిలో సంప్రదించాలని సూచించారు. దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ సూపరింటిండెంట్ పండా సతీష్ చెప్పారు. సీహెచ్‌సీ కౌన్సిలర్ వాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



వైద్య శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని ఎ.బి.కాలనీలో విశాఖపట్నానికి చెందిన కార్పొరేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలు పొందాలని సూచించారు. శిబిరంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి రోగులు వచ్చినట్టు చెప్పారు. విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు జి.శేషగిరి, రాంబాబు, అర్జుబాబు, కుశరాజు, దుర్గాప్రసాద్, రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్డంగి, అమీనాబాద్ సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, కించు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా సంధ్యారాణి బాధ్యతల స్వీకరణ



రాజవొమ్మంగి: స్థానిక సచివాలయంలో గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శిగా కాకర సంధ్యారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలేశ్వరం మండలం ఎర్రవరంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తు ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి పనిచేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, పాండూరు సుర్యనారాయణ శాస్త్రి, శేషుసాయిలతో ఈ సేవా కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, పాలకవర్గ సభ్యులు గౌరీ గీత మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని, పెతకంశెట్టి సుజాత, తదితరులు పాల్గొన్నారు.



వంతర్ల గ్రామంలో ఊటనీటిని సేకరిస్తున్న గిరిజనులు



జాకరవలసలో బోరు వద్ద గ్రామస్తులు



గెడ్డ నీరు సేకరించి తీసుకెళ్తున్న గిరిజన మహిళలు

గ్రామాల్లో దాహం కేకలు

తాగునీరు అందక గిరిజనుల ఇక్కట్లు
గెడ్డలోని కలుషిత నీరే శరణ్యం
రోగాల బారిన గ్రామస్తులు
పట్టించుకోని అధికారులు



సుదూరం నుంచి గెడ్డ నీరు సేకరించి తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు



గొందిగూడలో కలుషిత బావి నుంచి కలుషిత నీరు సేకరిస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీలో 34 గిరిజన గ్రామాలు ఉన్నాయి. మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. బిందెడు నీటి కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డలను గ్రామస్తులు ఆశ్రయిస్తున్నారు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీరు దొరకకపోవడంతో గిరిజనులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. పోతంగి పంచాయితీ గొందిగుడ గ్రామంలో గిరిజనులు కలుషితమైన బావిలోని నీటినే వినియోగిస్తున్నారు. జాకరవలస గ్రామంలో ఉన్న ఒక్క బోరు ద్వారా నీటి ధార ఎక్కువగా రాక పోవడంతో మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వంతర్ల గ్రామస్తులు కిలోమీటరు దూరంలో ఉన్న గెడ్డను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. బిందెడు నీటి కోసం మండటెండలో సుదూరం నుంచి నీరు తీసుకొస్తున్నారు. పూర్తి కలుషితమైన బురదనీరు ఉన్నా తప్పని పరిస్థితుల్లో తాగుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. మండల కేంద్రానికి సమీప దూరంలో ఉన్న చంపాపట్టి, కోసంగి, పనసపుట్టు, కొత్తవలస, పెద్దపాడు గ్రామాల్లోను తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామస్తులు సమీపంలో గెడ్డలను ఆశ్రయిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం మహిళలు ఇసుకలో గుంతలు తీసి రాత్రంతా గెడ్డ నుంచి ఒడిసి పట్టుకున్న నీటిని మరుసటి రోజు ఉదయం సేకరించి గ్రామస్తులు దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఎండవేడిమికి గెడ్డలు, బావుల్లోని నీరు అడుగంటడంతో తాగునీరు అందక పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని గిరిజనులు కన్నీరుమున్నీరవుతున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తాండవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

గెడ్డనీరే ఆధారం



వేసవి సమీపిస్తుండడంతో తాగునీరు దొరక్క పోవడంతో గ్రామాల్లో గెడ్డలను ఆశ్రయిస్తున్నాం. రోజు సాయంత్రం ఇసుకలో గుంతలు తీసి రాత్రంతా గెడ్డ నుంచి ఒడిసిపట్టిన నీటిని మరుసటి రోజు ఉదయం సేకరించి దాహార్తిని తీర్చుకుంటున్నాం. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలి.
– తాంగుల శత్రుగున్, చంపాపట్టి గ్రామం, పోతంగి పంచాయతీ

ప్రబలుతున్న రోగాలు



గెడ్డలోని పూర్తి కలుషితమైన బురదనీరు ఉన్నా వాటిని సేకరించి, తప్పని పరిస్థితుల్లో వినియోగిస్తున్నాం. దీంతో రోగాల బారిన పడక తప్పడం లేదు. తాగునీరు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు స్పందించి గ్రామంలో బోరు లేక గ్రావిటీ పథకం ఏర్పాటు చేయాలి.
– తాంగుల హరి, జాంకరవలస గ్రామం, పోతంగి పంచాయతీ

చర్యలు తీసుకుంటాం



ప్రస్తుతం మండలంలోని తాగునీటి కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవి సమీపించడంతో తాగునీటి సమస్యలు ఉన్నాయి. అయితే వారం రోజుల వ్యవధిలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.
– ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో, డుంబ్రిగుడ

పాఠశాల భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ హనుమంతరావు, ఎంపీటీసీ చిన్నారావు తదితరులు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ వై.కంఠవరం గ్రామంలో పాఠశాల భవనాన్ని శుక్రవారం సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నారావు శుక్రవారం ప్రారంభించారు. వై.కంఠవరం గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల వినతుల మేరకు అధికారులు నిధులు మంజూరు చేశారు. దీంతో పాఠశాలకు మరమ్మతు పనులు జరిగాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు తొలిగాయి. మరమ్మతు చేపట్టిన భవనం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తమ తల్లిదండ్రులు కలలు సాకారం చేయాలని వారు కోరారు. వార్డు సభ్యుడు రేగం రాములమ్మ, పీసా కమిటీ సభ్యుడు సోమయ్య, బీజేపీ నాయకుడు మత్స్యలింగం, గ్రామ పెద్ద కొండలరావు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు అలవర్చుకోవాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి రోహిత్

గూడెంకొత్తవీధి: విద్యార్థి దశ కీలకమైనదని ఈ సమయంలోనే మంచి లక్ష్యాలను, అలవాట్లను ఆచరించడం ద్వారా ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని చింతపల్లి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎం.రోహిత్ అన్నారు. మండలంలోని రింతాడ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినిలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు బాలికా చట్టాలను వివరించారు. హెచ్‌ఎం పాపయమ్మ, ఉపాధ్యాయులు కృష్ణవేణి, సౌమ్య, లలిత, పారా లీగల్ వలంటీర్లు చిట్టిబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ కన్నపరాజు

ఎటపాక: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎటపాక సీఐ కన్నపరాజు సూచించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని వాటి జోలికి వెళ్లొదన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సేవించినా, విక్రయించినా చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువత బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గంజాయి రవాణాపై సమాచారం ఇచ్చి సమాజాభివృద్ధికి యువత సహకరించాలని కోరారు.

నేడు మండల సమావేశం

డుంబ్రిగుడ: మండలంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలందరూ హాజరు కావా లని కోరారు. అన్ని శాఖల అధికారులు పనుల పూర్తి సమాచారంలో సమావేశానికి రావాలని లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నేడు జలదినోత్సవం

కొయ్యూరు: మండలంలోని 33 పంచాయతీల్లో శనివారం జలదినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఉపాధి హామీ ఏపీవో అప్పలరాజు తెలిపారు. ఫారంపాండ్ల వద్ద ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నీటి ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తామని అందరు పాల్గొవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ భవనం మరమ్మతుకు చర్యలు



శిథిలావస్థకు చేరిన బంగారుమామిడి అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతు కోసం ఎంపీడీవోకు పంపిన లేఖ

సాక్షి ఎఫెక్ట్..

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీ బంగారుమామిడి అంగన్‌వాడీ భవనం మరమ్మతుకు చర్యలు తీసుకోనున్నట్టు సీడీపీవో ఎం.వరహాలమ్మ తెలిపారు. ఈ మేరకు భవనం బాగు చేసేందుకు ఎంపీడీవో పూర్ణయ్యకు లేఖ నివేదించినట్టు పేర్కొన్నారు. 'శిథిల అంగన్‌వాడీ కేంద్రాలకు మోక్షమెప్పుడో?' అనే శీర్షికతో ఈనెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు సీడీపీవో ఎం.వరహాలమ్మ స్పందించి బంగారుమామిడి అంగన్‌వాడీ భవనం మరమ్మతు కోసం మండల పరిషత్ 15 జనరల్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో పూర్ణయ్య లేఖను నివేదించారు. అలాగే బంగారు మామిడి అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతు పనులు చేసేంత వరకు ఎలాంటి సామగ్రి భద్రపరచుకుండా గ్రామంలో మరో అద్దె భవనంలో నిర్వహించేందుకు సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తను ఆదేశించినట్టు చెప్పారు. దీంతో మండలంలో శిథిల భవనాల్లో నిర్వహించొద్దన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

హుకుంపేట: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్‌సీపీ అన్ని వేళలా అండగా ఉంటుంది మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్ అన్నారు. మండలంలోని రాప పంచాయతీ గొందిరాప గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, నాయకులు పర్యటించారు. ఈ మేరకు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిరంజీవి కుమారుడు వెంకటరమణ దొర పాడేరు మండలం మినుములూరులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో అరుకు నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, కొప్పుల లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు కోరాబు వెంకట్, నాయకులు శోభ ధర్మయ్యదొర తదితరులున్నారు.

వర్మీకంపోస్టు యార్డుల పరిశీలన



యార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి: ఘన సంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి పంచాయతీలకు ఆదాయాన్ని తీసుకురావాలని చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అన్నవరం, లోతుగెడ్డ, బెన్నవరం పంచాయతీల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సర్వేలను సత్వరమే పూర్తిచేయాలన్నారు.

ప్రూనింగ్ పనుల కోసం డిమాండ్

చింతూరు: వేసవిలో గిరిజనులకు ఆదాయాన్ని సమకూర్చే తునికాకు ప్రూనింగ్ పనులను వెంటనే మొదలు పెట్టాలని సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తునికాకు కోత కోసం సకాలంలో టెండర్లు పిలవక, ప్రూనింగ్ పనులు చేపట్టక పోవడంతో ఆకు పాడయ్యే పరిస్థితులుంటాయని, దీంతో గిరిజనులకు ఆదాయాన్ని కోల్పోయే అవకాశముందని ఆమె తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి వెంటనే తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టాలని కోరారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



విద్యార్థుల నృత్యాలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25వ సంవత్సరంలో కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. విద్యార్థులందరూ నేటి విద్యా విధానాన్ని అనుసరిస్తూ ఉన్నత స్థాయిని అధిరోహించాలన్నారు. అరకులోయ సీఐ ఎల్.హిమగిరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు మరింత జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సీఐ హిమగిరికి ప్రిన్సిపాల్, సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కళాశాలలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ధర్మారావు, అధ్యాపకులు డాక్టర్ పి.కొండబాబు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వైకుంఠరావు, విజయ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవం

కశింకోట: స్థానిక నూకాంబికఅమ్మవారి పుట్టుక మహోత్సవాన్ని గురువారం రాత్రి నుంచి ఉదయం వరకు ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య ముందు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి గరగలు, పాదాలను అందంగా అలంకరించిన రిక్షాపై సంప్రదాయ డప్పులు, విద్యుద్దీపాలు, సాంస్కృతిక నృత్యాలతో ఊరేగించారు.

ప్రీ ప్రైమరీ విద్యకు ప్రాధాన్యం



పెదబయలులో అంగన్‌వాడీలకు సూచనలిస్తున్న కో-ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు



గూడెంకొత్తవీధిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి



రాజవొమ్మంగిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెదబయలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యాభివృద్ధికి అంగన్‌వాడీలు కృషి చేయాలని సీడీపీవో వరహాలమ్మ, శిక్షణ కో–ఆర్డినేటర్ జంపరంగి సత్యనారాయణ అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1 లో అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పోషణ్ భీ... పడాయి భీ కార్యక్రమంపై శుక్రవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సిబ్బందికి ప్రీ ప్రైమరీ విద్యకు సంబంధించిన పలు అంశాలపై సీడీపీవో బాలచంద్రమణిదేవి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందజేయాలని సూచించారు.

గూడెంకొత్తవీధి: చిన్నారులు, బాలింతలకు సంపూర్ణ పోషణ అందించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి అన్నారు.అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు పోషణ్ భీ.. పడాయి భీ అంశంపై శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రాజవొమ్మంగి: స్థానిక విద్యావనరుల కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్ భీ.. పడాయి భీ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నవ చేతన అనే అంశంపై 6 నెలల నుంచి సంవత్సరాల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులకు విద్యపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు అరుణలత, నాగ జయలక్ష్మి, అమ్మిరాజు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.